క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెలిగండ్ల: మండలంలోని పి.రాళ్లపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

పీసీపల్లి: జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జమ్ములపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు కర్నాటి చంద్రశేఖర్ , వడ్డెపల్లి మదన్ కుమార్‌లు ఎంపికయ్యారు. విద్యార్థులను, పీడీ సుజాతను ప్రధానోపాధ్యాయుడు ఎల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం


కాలుతున్న పూరి గుడిసె

కనిగిరి రూరల్: మండలంలోని విశ్వనాథపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వక్కల కొండయ్యకు చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, ధాన్యం, ఇతర వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. అప్పటికే పూర్తిగా కాలిపోయింది.

గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పామూరు: ప్రజా ఉద్యమకారుడు, ప్రజాగాయకుడు, గద్దర్ మృతి తీరని లోటని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజాసంఘాల నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య, షేక్ నాయబ్‌రసూల్, కోఆప్షన్ నాయబ్‌రసూల్ అన్నారు. స్థానిక స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆయన ఆలపించిన గీతాలు సమాజాన్ని మేల్కొలిపాయన్నారు. కొట్టే రవీంద్ర, టి.వెంకటేశ్వర్లు, నారాయణ, శ్రీరాం శ్రీను, అరియారం ఏడుకొండలు, రాజేష్, పోలేపల్లి బాల సిద్ధయ్య, సయ్యద్ జిలానీ, గంధం బాస్కర్, గంధం బాబు పాల్గొన్నారు.

స్పందనకు 29 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 29 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలం నుంచి 8, మర్రిపూడి 5, సీఎస్‌పురం 2, హెచ్‌ఎంపాడు 2, దర్శి 2, కురిచేడు 1, కొనకనమిట్ల 2, పొదిలి 1, దొనకొండ 1, వెలిగండ్ల 1, పీసీపల్లి 2, పామూరు మండలం నుంచి 2 అర్జీలను అర్డీఓ తోట అజయ్‌కుమార్‌కు స్పందనలో అందచేసినట్లు డీఏఓ బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇంటింటికీ మెరుగైన వైద్య సేవలు


వైద్య సేవలు అందిస్తున్న లీనా రాఫెల్

జరుగుమల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నిరు పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లీనా రాఫెల్ అన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో సోమవారఫ్యామిలీ డాక్టర్ కార్యకమం నిర్వహించారు. వైద్య శిబిరంలో 72 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రూత్, ఏఎన్‌ఎం గంగా భవాని, ఆరోగ్య సహాయకులు, విజయకుమార్, డీఈఓ స్వాతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం


మురుగమ్మిలో కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు


పామూరులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న అధికారులు సభ్యుడు


సీఎస్‌పురంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పామూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, రెండో ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక డీవీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతిల ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓలు మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంట లోగా పిల్లలకు ముర్రుపాలు తాగించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. అనంరతం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, కో ఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, ఎన్‌జీఓ నాయబ్‌రసూల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓ పాల్‌రాజు, రామసుబ్బులు, రమీజాబి, వీవీ నాగమణి పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని సీనియర్ ఉపాధ్యాయురాలు కె.సౌభాగ్యలక్ష్మి అన్నారు. సీఎస్‌పురం వడ్డెపాలెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం తల్లిపాలవారోత్సవాలు ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు.

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ నల్లగంగుల శ్రీనివాస యాదవ్, సూపర్‌వైజర్ జరీనా, శబరి కంతారెడ్డిల ఆధ్వర్యంలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ ఆహార కిట్లు పంపిణీ చేశారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

- ఎంపీడీఓ షేక్ జమీఉల్లా

సింగరాయకొండ: ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని స్టేజ్–1 ఎన్నికల అధికారులకు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా సూచించారు. పంచాయతీ ఉపఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో పాకల పంచాయతీ సర్పంచ్ కొక్కిలిగడ్డ రోశయ్య, సింగరాయకొండలో 16వ వార్డు మెంబర్ షేక్ హాఫీదా బేగం అనారోగ్య కారణాలతో మరణించగా, మూలగుంటపాడులో 10వ వార్డు మెంబరు దేశంశెట్టి రమేష్ కందుకూరు కోర్టులో జడ్జిగా నామినేటెడ్ కావడంతో వార్డు మెంబరు పదవికి రాజీనామా చేశారని.. ఈ మూడు స్థానాలకు ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి 10వ తేదీ వరకు ఆయా పంచాయతీ కార్యాలయాల్లోనే నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల స్వీకరణ

కొండపి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ ఎంవీ రమణమూర్తి తెలిపారు. 11వ తేదీ స్క్రూటినీ, 14న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 19న ఓటింగ్ నిర్వహిస్తామని అదే రోజున మధ్యాహ్నం నుంచి కౌంటింగ్ జరుగుతుందని ఎంపీడీఓ ఓ ప్రకటనలో వివరించారు.

మండలంలోని పెదకండ్లగుంట గ్రామ పంచాయతీ 10వ వార్డు మెంబర్ జి.నర్సమ్మ, చినకండ్లగుంట పంచాయతీ 4వ వార్డు మెంబర్ ఎ.తిరిపాలు, కె.ఉప్పలపాడు పంచాయతీ 10వ వార్డు మెంబర్ కె.అంజమ్మ మృతి చెందడంతో ఆయా వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఎన్నికలకు సంబంధించి స్టేజ్–1 అధికారులుగా ఉప్పలపాడుకు ఎంఈఓ–1 కె.సురేఖ, చినకండ్లగుంటకు ఎంఈఓ–2 రామారావు, పెదకండ్లగుంటకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎన్.రసూల్ వ్యవహరిస్తారని తెలిపారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పెదఅలవలపాడు 1వ వార్డు, పెదయిర్లపాడు 4వ వార్డు, గుంటుపల్లి పంచాయతీ 3వ వార్డులకు ఎన్నికలు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 14న విత్ డ్రా, నామినేషన్ల పబ్లికేషన్, 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు, విజేతల వివరాలు ప్రకటిస్తామన్నారు.

మర్రిపూడిలో రెండు వార్డులు

మర్రిపూడి: మండలంలోని కూచిపూడి, కాకర్ల పంచాయతీ వార్డులకు సంబంధించిన ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. మండలంలోని కాకర్ల 8 వార్డు, కూచిపూడి 4 వార్డు సభ్యులు మృతి చెందడంతో ఖాళీగా ఉన్న వార్డులకు ఈ నెల 19న ఓటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టంగుటూరులో మూడు వార్డులు

టంగుటూరు: మండలంలోని కందులూరు 2వ వార్డు(ఓసీ), పొందూరు 1వ వార్డు(ఓసీ), వాశేపల్లిపాడు 2వ వార్డు(ఎస్టీ)కు ఈ నెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజున ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

చేనేత దుస్తులు ధరిద్దాం


చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు


కొండపిలో చేనేత వస్త్రాలను తిలకిస్తున్న స్థానికులు

కనిగిరి రూరల్: చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని హెచ్‌ఎం విజయలక్ష్మీ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో భారతీయ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చేనేత దుస్తులు ధరించి వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. వాగుపల్లి ఎంపీయూపీఎఫ్ పాఠశాలలో చేనేత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులను చేనేత కార్మికుల గృహాలను తీసుకెళ్లి, వారు తయారు చేసే దుస్తులు, పరికరాలు, మగ్గాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. హెచ్‌ఎం ఖాదర్‌బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా నిలవాలి

కొండపి: ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని గ్రంథపాలకుడు బత్తుల కోటేశ్వరరావు కోరారు. జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని గ్రంథాలయంలో సోమవారం చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠకులతోపాటు స్థానికులు వస్త్ర ప్రదర్శనను తిలకించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని గ్రంథపాలకుడు విజ్ఞప్తి చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


బాధితుడికి ఫోన్ అంజేస్తున్న ఎస్సై

టంగుటూరు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఎస్సై ఖాదర్ బాషా స్థానిక పోలీసు స్టేషన్లో సోమవారం అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. టంగుటూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన ఐ. రామకొటయ్య టంగుటూరులో ఫోన్ పొగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా ఐటీ కోర్ టీమ్ సాంకేతికత సాయంతో గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టంగుటూరు పోలీసు స్టేషన్లో 45 మందికి సెల్‌ఫోన్లు గుర్తించి అందించామని చెప్పారు. టెక్నికల్, ఐటీకోర్ టీమ్ సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీపీఎం దేవిడ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ క్రాంతి పథకంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళా సమాఖ్య సంఘాలు అభివృద్ధి చెందాలని డీపీఎం దేవిడ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఎల్‌ఈడీ (లైవ్‌లీ హుడ్, డొలప్‌మెంట్ ఇంటర్‌ప్రైజెస్) కింద జీవనోపాధుల అభివృద్ధి పథకానికి దరఖాస్తు చేసుకున్న అర్జీలను పరిశీలించారు. ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బగుడు వికాసం, ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీం, తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీ జీవరత్నం, ఏపీఎం బీఎల్ సుబ్బారావు, వై కేపీ అధికారులు పాల్గొన్నారు.

దశల వారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వార్డుకు మంజూరైన డ్రైనేజీ కాలువ పనులు తక్షణం ప్రారంభించాలని కాంట్రాక్టర్లను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతన్నారు. ఇళ్లల్లో నుంచి వచ్చే చెత్తను రోడ్లపై వేయవద్దని తెలిపారు. స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామన బోయిన ప్రశాంతి శ్రీను, స్థానిక నాయకులు జానీ, శ్రీను,సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.58 లక్షలు


ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దంపతులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి రూ.1,58,165 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.82,840, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ..30,010, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.28,115, ఆలయంవద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.17,200 వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి గుంటూరుకు చెందిన సానికొమ్ము కొండారెడ్డి, కవిత దంపతులు విరాళంగా రూ.13,200, శాశ్వత అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఆళ్ల నారాయణరెడ్డి, జానకి దంపతులు రూ.10 వేల విరాళం నగదును ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణకు అందజేశారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.273


టంగుటూరులో వేలంలో పాల్గొన్న బయ్యర్లు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి చిరికూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాల రైతులు సోమవారం 1187 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 1141 కొనుగోలయ్యాయి. 46 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.273, కనిష్ట ధర రూ.159, సరాసరి ధర రూ.264.64 పలికింది. వేలంలో మొత్తం 38 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో...

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాల రైతులు సోమవారం 1701 బేళ్లు తీసుకురాగా వ్యాపారులు 1,537 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 24 బేళ్లను తిరస్కరించారు. 140 బేళ్లు జంపింగ్ కింద నమోదయ్యాయి. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.271, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.262.56 రైతులకు దక్కిందని వేలం కేంద్రం అధికారి రామారావు తెలిపారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి


కోవిలంపాడు పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం (పామూరు): పాఠశాలకు వచ్చే విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంఈవో జె.ప్రసాదరావు అన్నారు. మండలంలోని కోవిలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలను, ఆనికాలపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోవిలంపాడు పాఠశాల రికార్డులు పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజన అమలు తీరుపై విద్యార్థులతో చర్చించారు. ఆనికాలపల్లి పాఠశాలను తనిఖీచేసిన ఆయన విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. కోవిలంపాడు హెచ్‌ఎం బి.శివప్రసాదాచారి, ఆనికాలపల్లి హెచ్‌ఎం జె.భారతి, నారాయణం అలేఖ్య, విద్యార్థులు ఉన్నారు.

బస్సు సర్వీసుల సమస్య పరిష్కరిస్తా

- ఆర్టీసీ ఒంగోలు ఆర్‌ఎం సుధాకర్‌బాబు


బస్టాండ్‌లో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుధాకర్‌బాబు

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండుకు బస్సు సర్వీసులు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఒంగోలు ఆర్‌ఎం సుధాకర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఎం మాట్లాడుతూ.. బస్టాండుకు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో బస్సులు సక్రమంగా రావడం లేదని ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ బత్తుల సుప్రజరెడ్డి తన దృష్టికి తీసుకురావడంతో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. రోజు 63 చొప్పున బస్సు సర్వీసులు రావాల్సి ఉండగా 50 మాత్రమే వస్తున్నాయన్నారు. ఏయే సర్వీసులు బస్టాండ్‌కు రావడం లేదో గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొద్ది రోజులపాటు రాత్రి వేళల్లో స్పెషల్ స్క్వాడ్‌ను నియమించి పర్యవేక్షిస్తామన్నారు. బస్సు సర్వీసులు సక్రమంగా రానప్పుడు 9959225690, 9959225695కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రయాణికులకు సూచించారు. అనంతరం బస్టాండులో అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణా పనులను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో సత్వర సేవలు


ఆర్బీకే శ్లాబు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

టంగుటూరు: రైతులకు ఆర్బీకేల ద్వారా సత్వర సేవలందుతాయని సర్పంచి పసుమర్తి ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కందులూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం శ్లాబు నిర్మాణ పనులను ఆమె సోమవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సహకారంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రవిబాబు, ఏఈ శ్రీహరి, ఏఏఈ యశ్వంత్, నాయకులు ఉప్పలపాటి రామరాజు, మన్నం వెంకయ్య, యు సత్యనారాయణరాజు, రామిశెట్టి దాసయ్య, భాస్కరరాజు, వెంకటేశ్వరరాజు, రామ్మూర్తి రాజు, పసుమర్తి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

డీవార్మింగ్‌ను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సింగరాయకొండ: ఈనెల 10వ తేదీ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులను ఎంపీడీఓ షేక్ జమీఉల్లా కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ డీఓ మాట్లాడుతూ.. నులి పురుగుల వల్ల పౌష్టికాహార లోపంతోపాటు రక్తహీనత కలుగుతుందన్నారు. సింగరాయకొండ మండలంలో 1 నుంచి 19 ఏళ్ల వయసుగల చిన్నారులు, యువత 14,992 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదీన మాప్ అప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈఓఆర్డీ సుధాకర్, ఏపీఓ సీహెచ్‌వీ సుధాకరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సృజన

సీఎస్‌పురం (పామూరు): సీజనల్ వ్యాధులపై ప్రజలను వైద్యసిబ్బంది అప్రమత్తం చేయాలని కనిగిరి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.సృజన అన్నారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది రికార్డులు, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈసందర్భగా సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఆమె చిన్నారులు, గర్భిణులు, తల్లులకు టీకాలను వైద్యసిబ్బంది క్రమం తప్పకుండా సజావుగా వేయాలన్నారు. ఇంద్రధనస్సు నిర్వహణ ద్వారా టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన పిల్లలను గుర్తించాలన్నారు. ఈ నెల 10న జరిగే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సరఫరా ట్యాంకులను పరిశీలించి తక్షణం ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని, నీటిసరఫరా పైపులైన్ లీకులు ఉంటే తక్షణం మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వై.రమేష్‌కు సూచించారు. పెదగోగులపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆమె సచివాలయ పరిధిలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందిరెడ్డి మురళి, మహేష్, హోమజ్యోతి, సీహెచ్‌ఓ వెంగయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

పీసీపల్లి: ఒంగోలు ఏకేవీకే కళాశాలలోని యోగాసన స్పోర్ట్స్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పెదవరిమడుగు పాఠశాలకు చెందిన స్వర్ణ యశస్విని తృతీయస్థానం సాధించింది. అండర్–14 బాలికల విభాగంలో గెలుపొందిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే పెదవరిమడుగు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న స్వర్ణ రమణయ్య పురుషులు 34–45 ఏళ్ల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఎంఈఓ , ఉపాధ్యాయులు, హెచ్‌ఎం సన్మానించారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

జరుగుమల్లి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తే రైతులకు అధిక దిగుబడితో పాటు ఆశించిన లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయ ఎంటీ ఎస్తేరమ్మ పేర్కొన్నారు. జరుగుమల్లి గ్రామంలో మహిళా రైతు ఇత్తడి ధనలక్ష్మి పొలంలో రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సరిహద్దు పంటల విధానం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పెద్దిరాజు, వెంకట రమణమ్మ, ధనమ్మ, సుదారాణి, రంజిత్, మాల్యాద్రి, ఐసీఆర్పీలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదవాలి

హనుమంతునిపాడు: పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదవాలని డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని సీతారాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, సర్పంచ్ భర్త మారంరెడ్డి రవేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.